

# కలలకు కేంద్రం

కోరుకొండ సత్యానంద్

ఏ క్లాసూ తప్పకుండా ఎమ్మెస్సీ పూర్తి చేసిన వెంటనే ఓ ప్రభుత్వసంస్థలో మ[illegible]మైన ఉద్యోగం సంపాదించుకున్న అదృష్టవంతుడు ఆనంద్....

అంతటి అదృష్టవంతుడి చుట్టూ ఎదిగిన పెళ్ళికాని అమ్మాయిలున్న తండ్రులు అంతిస్తాం, ఇంతిస్తాం.... మా అమ్మాయి రంభ, ఊర్వశి, మేనక అంటూ తిరగడం సహజం .... పురుషలక్షణం ఉరవ్ ఉద్యోగం, అందం, వయసు, యోగ్యత అన్నీ ఉన్న అబ్బాయి నిరభ్యంతరంగా, నిస్సంకోచంగా పెళ్ళిచేసుకోవడం కూడా సహజమే!

అందుకే ఎంచి, ఎంచి.... ఏరి ఏరి ఓ అందమైన అమ్మాయిని సెలక్ట్ చేసుకున్నాడు.... ఆనంద్ సెలక్ట్ చేసుకున్న అమ్మాయిని అతని తల్లిదండ్రులూ తమ కోడలిగా చేసుకునేందుకు సంతృప్తిగా ఒప్పుకున్నారు.... కారణం, ఆ అమ్మాయి ఉత్త చేతుల్తో తమింటికి రావడంలేదు మరి! ఆదర్శాలు తెలిసినా, గుండె కడలిలో ఆశయాల కెరటాలు ఉప్పొంగుతున్నా వాటిని అదుపులోకి తెచ్చుకోక తప్పలేదు ఆనంద్ కి..కాగా, ఆ అమ్మాయి తల్లిదండ్రులే తన తల్లిదండ్రులు నోరు మెదపకముందే ఇచ్చేవి చెప్పేసారు.... ఆ

'ఇచ్చేవి'కి తన తల్లిదండ్రులు కూడా తృప్తిపడ్డారు.... తమ కొడుకు విలువ 'ఇంతుందా!'అని తెలిసి మొదట ఆశ్చర్య పడి, తర్వాత ఆనందపడిపోయారు...

పట్టి, పీడించి....అత్తమామల్ని పీమ గుల్లా చేసి.... కట్టుకున్న భార్యను హింసిస్తూ....వసూలు చేసి సంతృప్తి పడడం అన్యాయం! అక్రమం!! కాని, మాకు పోలేదంత ఉంది, మా సంతోషం కోసం తీసుకోండి అని అమ్మాయి తల్లి దండ్రులే కోరి మరీ కోర్కె తీర్చుకోవా లనుకుంటున్నప్పుడు, వాళ్ళ కోర్కెను మన్నించడం ఆదర్శాన్ని అవలబడ్డున వదిలేయడం, ఆశయాల్ని అల్లంత దూరాన్నుంచడం, అభ్యుదయం గొంతు దిగక పోవడం కాదన్నది ఆనంద్ ఉద్దేశం....

ఎవరేమన్నా, ఏమనుకున్నా ఎవరి ఉద్దేశాలు వారివి మరి!

పెళ్ళి పదిరోజులుందనగానే ఖరీదైన పెళ్ళికార్డులు పట్టుకొని తల్లిదండ్రులు బంధువుల దిక్కుకు, ఆనంద్ మిత్రుల దిక్కుకు బయలుదేరారు....

మిత్రులందరికీ కార్డులు పంచిపెట్టడం అయిపోయిన ఆ రోజు సాయంత్రం ఆహ్లాదకరంగా, హాయిగా ఉంది...ఆనంద్ మనసుకూడా హాయిగా, తేలిగ్గా ఆనందం అనే ఆకాశం మీద మేఘంలా తేలి పోతుంది

ఆనంద్ చేతిలో ఓ పెళ్ళికార్డు ఉంది దానిమీద అతనికి ప్రత్యేకమైన శ్రద్ధ ఉంది.... అందుకే దానికి విపరీతంగా సెంటు పూయబడింది.... సెంటు పూసిన కవర్లో పెట్టబడింది.... ఆ కవరు మీద అందమైన ముత్యాల్లాంటి దస్తూరి ఉంది..

ఆ అతి ప్రత్యేక శ్రద్ధకు కారణం... ఆ కార్డు కమలమ్మగారికి ఇవ్వబోతు న్నాడు ఆనంద్.... నిజానికి ఆ శ్రద్ధకు కారణం కమలమ్మగారు కాదు.... ఒక అందాల భరిణె, అపరంజి బొమ్మ, అందానికే అందం అయిన అరుణ....

అరుణ కమలమ్మ గారి కుమార్తె....

అందుకే శుభ్రంగా స్నానం చేసి, నీట్‌గా డ్రెస్సప్పయి, చక్కగా తల దువ్వుకొని, రెండు మూడు రకాల పౌడ్ర టిక్స్ రాసుకొని, పూసుకొని.... పోలో పోలార్ నాగుల్స్ ధరించి, స్కూటర్ మీద దొరబాబులా బయలుదేరాడు ఆనంద్....

తన పెద్దకొడుకైన రాంబాబుకు స్కూల్లో చదువు సరిగా అబ్బడంలేదని, వెళ్ళి వాళ్ళ పంతులమ్మగారికి చెప్పి అక్కడ ప్రైవేటు ఏర్పాటు చేయమని సుందరం తన సొంత తమ్ముడైన ఆనంద్‌కు పురమాయించాడు.... ఆ పంతు లమ్మగారింటికి వెళ్ళి అన్నగారు చెప్పిన పని చేస్తుండగా ఆ పంతులమ్మగారు ఆ పనికి సుముఖత చూపిస్తుండగా ఒక అందాల భరిణె, అపరంజి బొమ్మ,

అందానికే అందం అయిన ఒక అమ్మాయి వచ్చి కాఫీ ఇచ్చింది....

ఆనంద్ కళ్ళు మెరిసాయి.... ఆ అమ్మాయి కనురెప్పల్ని రెపరెపలాడించింది....ఆనంద్ మనసు అమృతమేఘాల్లో తేలిపోయింది....

అప్పట్నించే ఆ ఇంటిలో పరిచయం కోసం ప్రయత్నించాడు....ప్రయత్నించి పొందాడు...చక్కగా, సరదాగా మాట్లాడే ఆనంద్ అంటే వాళ్ళకు ఎంతో సరదాగా, ముచ్చటగా ఉంటుంది... వాళ్ళింట్లో వాడిగా మెలగడం అలవడింది కొన్నాళ్ళకు....ఆ ఇంట్లో ఉన్న ఆ ఇద్దరికీ కూడా ఆనంద్ అంటే మంచి అభిప్రాయం, చనువు బాగా ఏర్పడ్డాయి.... ఆ ఇద్దరూ ఎవరంటే కమలమ్మగారు, అరుణ...

స్కూటరు విశాలమైన రోడ్డుమీద జోరుగా సాగిపోతుంది....

కావాలని సమయాన్ని ఖాళీ చేసుకొని కమలమ్మగారింటికి వెళుతున్న ఆనంద్ కోరిక నిండిన కళ్ళలో అరుణవైపు చూస్తుండేవాడు....

సున్నితమైన, అందమైన సౌష్ఠవంగల అరుణ శరీరం, ఆమె ఆకర్షణీయమైన కళ్ళల్లోని భావాలు, ఆమె చక్కని ముఖ కవళికలు, కదలికలు....ఆనంద్‌ను తమకంలో ముంచేసేవి....ఎన్నో సమయాల్లో ఎన్నోసార్లు మనిషి చలించిపోయేవాడు. అకస్మాత్తుగా ఆనంద్ శరీరం వేడెక్కిపోయేది నరాలు జివ్వుమనేవి ఆ తమకాన్ని తట్టుకోలేకపోయేవాడు....

అప్పుడప్పుడూ ఆమె శరీర స్పర్శ హాయిగా, ఆనందంగా తగిలేది.... ఆమె కొన్నికొన్ని సమయాల్లో నవ్వే నవ్వుకు ఆనంద్ మతిపోయేది... కమలమ్మగారు తమ దగ్గర లేనప్పుడు ఆమెకు ఎంత దగ్గరగా వెళ్ళినా ఆమె అనేది కాదు.... అదోలా చూసేది.... ఆ చూపు అర్థం ఏదైనా అది ఆనంద్‌కు ఎంతో ఉత్సాహాన్నిచ్చేది....

ఆమెను పూర్తిగా అనుభవించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసాడు ఆనంద్... ఆ అవకాశం తనకు లేకపోలేదు అని కూడా అనుకొనేవాడు.... అంత అదృష్టాన్ని తీసుకొని వచ్చే ఆ రోజు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేవాడు... ఎంతో ఆత్రత పడేవాడు .... ఆమె అందాన్ని జుర్రేయడానికి ఎంతో తాపత్రయపడేవాడు....

ఆ ఇంటిలో ఆ అవకాశం ఉన్నా అంత అదృష్టం పట్టలేదు ఆనంద్‌కి.... కమలమ్మగారు స్కూలుకు వెళ్ళే సమయంలోనే అరుణ కాలేజీకి వెళ్ళేది.... అప్పుడప్పుడూ ఒంటరిగా చిక్కినా కమలమ్మగారు ఇంటికి వచ్చేస్తారనే సమయంలోనే ఆ అవకాశం చిక్కేది.... ఆ సమయాల్లో ఏదో అదోలా మాట్లాడేవాడు ఆనంద్ అరుణ చిన్నగా నవ్వేది తప్ప ఏమీ అనేదికాదు

అరుణ తండ్రి అరుణ చిన్నప్పుడే పోయారని, బంధువులు చాలా దూర ప్రాంతాల్లో ఉండడంవల్ల క్రమంగా రాకపోకలు తగ్గిపోయాయని మాత్రం తెలిపింది కొన్ని మాటల్లో...

....నాకు పెళ్ళికూడా కుదిరిపోయింది. పెళ్ళయ్యేలోగా అరుణను ఎలాగైనా ఒక్కసారైనా శారీరకంగా సొంతం చేసుకోవాలి.... అని అనుకుంటున్నాడిప్పుడు ఆనంద్....

స్కూటరు ఆ ఇంటిముందు ఆగింది....

ఆనంద్ ఆ ఇంట్లోకి అడుగు పెట్టాడు....

కమలమ్మగారు ఇంటిదగ్గరే ఉన్నారు... ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నారు ....ఆ ప్రక్క కుర్చీలోనే అరుణ కూడా కూర్చుని ఎంబ్రాయిడరీ చేస్తుంది....

లోపలకు వచ్చిన ఆనంద్‌ని చూసి కమలమ్మగారు.... "ఏవయ్యా!! నాల్రోజుల్నుండి రాలేదు...రా, కూర్చో!" అని కుర్చీ చూపించారు.... కూర్చుంటూ అరుణవైపు చూసాడు ఆనంద్....

అరుణ ఆనంద్‌ను మెరిసే కళ్ళతో పలకరించింది....

"ఏమీలేదండి .... పెళ్ళిపనుల్లో పడిపోయానండి .... ఇదిగోండి కార్డు.... పెళ్ళికి ఆ రోజు ఉదయమే మీరు, అరుణగారు తప్పకుండా చెప్పేయాలి " అని చేతిలోని కార్డును ఆమెకు అందించాడు ఆనంద్

"అబ్బ! ఘుమఘుమలాడిపోతుందయ్యా కార్డు....ఎంత సెంటు పూసావేమిటి?" అని నవ్వుతూ అడిగి కవరులోని కార్డును పైకి తీసి చూసారు కమలమ్మగారు...

"...మీ మీద ఉన్న అభిమానమంత!" అని కమలమ్మగారితో అని అరుణవైపు 'నీ మీద ఉన్న ప్రేమంత!' అన్నట్లుగా చూసాడు....

అరుణ చిన్నగా, అందంగా నవ్వి తలవంచుకుని మరల తన పనిలో నిమగ్నమైపోయింది....

"ఊ.... పెళ్ళికూతురి పేరు సుజాత.., చాలా బావుందయ్యా....ఏం చదువుకుందయ్యా మీ ఆవిడ?"

"ఇంటర్‌తో ఆపేసారటండీ...."

"ఆ మాత్రం చాల్లే.... ఆడపిల్లకు ఓర్పు, నేర్పు ఉండి ఆ మాత్రం చదువుకుంటే చాలు...."

ఆ తర్వాత పదినిమిషాలు పెళ్ళి ముచ్చట్లు మాట్లాడుకున్నారు....

"నేను రేపు వైజాగ్ వెళ్తున్నానయ్యా స్కూలు పనిమీద.... మరలా రెండు రోజుల్లో వచ్చేస్తాను...." అన్నారు కమలమ్మగారు మాటల్లో....

ఆ మాటవిన్న ఆనంద్ మనసు పురివిప్పి నాట్యం చేయసాగింది.... కాఫీ చేయడానికి కమలమ్మగారు లోపలకు వెళ్ళినప్పుడు ఆనంద్ నెమ్మదిగా లేచి, అనందాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ అరుణ

వెనక్కి వెళ్ళి నిల్చొని ఆమె భుజాల మీద రెండుచేతుల్నీ సుతారంగా ఆనించి ....వంగి, నెమ్మదిగా చెవిలో అన్నాడు....

"ఎన్నోసార్లు ఎన్నో అవకాశాల్ని చేజిక్కించుకోలేకపోయాను .... రేపటి అవకాశం మాత్రం వదులుకోను.... అందుకు నువ్వు సహకరిస్తావు కదూ? రేపు మధ్యాహ్నం ఆఫీసుకి శెలవు పెట్టి సరిగ్గా రెండుగంటలకు వస్తాను....సరేనా అరుణా?" అని నెమ్మదిగా భుజాల్ని నొక్కి వదిలాడు....

అరుణ ఆనంద్ వైపు అలాగే చూస్తూ ఉండిపోయింది .... ఆనంద్ చిన్నగా నవ్వాడు....

* * *

గోడ గడియారం రెండు గంటలు కొట్టింది....

ఏదో పుస్తకం పట్టుకొని ఏవేవో ఆలోచిస్తున్న అరుణ ఆలోచనలు పుటుక్కున తెగిపోయాయి....

అంతలో.... వీధిగేటు తెరుచుకున్న శబ్దం వినిపించి కిటికీ కర్టెను తొలగించి చూసింది.... ఆనంద్ వీధి గేటు గడివేసి లోపలకు వస్తున్నాడు....

రెండు నిముషాల్లో లోపలకు వచ్చాడు....వచ్చి సోఫాలో కూర్చొని ఉన్న అరుణవైపు కళ్ళల్లో ఆశ్చర్యాన్ని నింపుకొని చూసాడు....

గుండ్రని ముఖం.... చేపపిల్లలాంటి కళ్ళు....వంగిన విల్లులాంటి కనుబొమలు ....వాటిమధ్య ఉదయకాలపు సూర్యుణ్ని పోలిన బొట్టు....నాజూకైన నాసిక, చిన్ని చుబుకం.... తెల్లని చీర, జాకెట్టు, ఆకర్షణీయమైన ఒంపుసొంపులున్న శరీరం.... తలలో మల్లెలు....

మత్తెక్కిపోయింది ఆనంద్‌కు

చిన్నగా, హుందాగా...అమాయకపు ముఖంతో ఏమీ ఎరుగనివాడిలా ఉండే ఆనంద్‌ని ఒక్క క్షణం చూస్తూ ఉండిపోయింది అరుణ...ఈ రోజు అతని అలంకరణలోని మార్పును గమనించిందామె....

నైస్ బ్లూపాంటుమీద తెల్లని ఖరీదైన షర్టు....

అరుణ నవ్వింది....

"ఎందుకు నవ్వుతున్నావ్ అరుణా?" అని ప్రక్కకు వచ్చి కూర్చున్నాడు ఆనంద్....

"ఏంలేదు, అన్న టైమ్‌కు టంచన్‌గా వస్తేనూ...."

"అవును....నేను అన్నింటికీ టైమ్ మెయింటైన్ చేస్తాను...."

"వీధి తలుపు వేసేసావా?"

"అది వేరే అడగాలా?" అని అరుణ భుజంమీద చేయివేసాడు....

"కాఫీ, టీ ఏదైనా త్రాగుతావా?"

"ఊఁ....త్రాగుతాను.... కాఫీ, టీలు మాత్రం కావు?"

"మరి?"

"నీ అందాన్ని...."



"నువ్వు భలే మాట్లాడతావే...."

"అలాగా? మరి నాకు మాటలు రావని అందరూ అంటారే!"

"అయితే వాళ్ళందరూ తెలివితక్కువ వాళ్ళు.... ఇంతకూ అలా అన్నవాళ్ళు ఆడవాళ్ళా? మగవాళ్ళా?

"నాకు ఆడవాళ్ళెవరితోనూ ఏలాంటి పరిచయాలు లేవు....

"ఇదే మాట నువ్వు నీ జీవితంలో మరోసారి తప్పకుండా అంటావు...."

"నేనా? ఎప్పుడూ? ఎవరితో?"

"నీ శోభనంనాడు....నీ భార్యతో....

ఆ మాటకు పకపకా నవ్వాడు ఆనంద్ ....నవ్వుతూ అరుణను మరింత దగ్గరకు తీసుకున్నాడు.... అతని శరీరం ఒక్క క్షణంలో వేడెక్కిపోయింది....కోరికలు కళ్ళెంలేని గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయి....

"రా అరుణా!" బరువెక్కిన కంఠంతో అన్నాడు....

"ఎక్కడికి?"

"దగ్గరగా....ఇంకా దగ్గరగా...నాలో నీవు, నీలో నేను కలిసిపోవాలి.... కరిగిపోవాలి."

"అందుకు నీకూ నాకూ ఉన్న సంబంధం ఏమిటి? స్నేహమా? ప్రేమా?"

ఆనంద్‌కి ఏంచెప్పాలో అర్థంకాలేదు. ....అరుణ మాటలు అతనికి విచిత్రంగా ఉన్నాయి...కవ్విస్తూ, నవ్విస్తూ, ఊరిస్తూ ఉండే అరుణ ఇలాంటి మాటలంటుందేమిటి?

"సమాధానంకోసం ఆలోచిస్తున్నావా?"

"లేదు.... నీ గురించే ఆలోచిస్తున్నాను...."

"ఏమని?"

"రమ్మని ఆహ్వానించి ఇలాంటి మాటలు అంటున్నావేమిటా అని...."

"ఏం, రుచించడం లేదా?"

"లేదు .... ఆనందాన్ని ఆర్పేస్తున్నాయి...."

"నా దగ్గరకు ఆనందం కోసం వచ్చావా?"

"ఏమిటా ప్రశ్న....?"

"జీవితంలో ఆనందంలేనిదాని దగ్గర ఆనందం ఏముంటుంది?"

"అంటే?"

"ఆనంద్! నీకో కథలాంటి జీవితం గురించి చెప్పాలి.... అది విన్నాక నీకు ఆనందం ఎలాగూ కలగదు... కానీ, నీకు కావాల్సిన శారీరకానందం మాత్రం నేను పూర్తిగా ఇస్తాను...."

"కథ.... ఎవరిది?"

"నాదే....మామూలు కథే!...అందరికీ జీవితం ఉంటుంది.... కానీ కొందరికి అది శాపంలా ఉంటుంది.... నా జీవితం నాకు శాపంగానే మిగిలింది...."

అరుణ కంఠానికి, ఆ కంఠంలోని ఎప్పుడూ కన్పించని అదోరకమైన భావానికి ఆనంద్ మామూలు మనిషి అవుతున్నాడు....అతని కదేమిటో తెల్సుకోవాలన్పించింది....

"చెప్పు అరుణా!"

"ఆ శాపంలో ఉన్న నేను దాన్ని మరువడానికి కొందరితో మాట్లాడతాను... సరదాగా ఉంటాను .... మామూలుగా చూస్తాను....నా మాటలు, నా నవ్వు, నా చూపులు అవతలివాళ్ళకు ఎలా కన్పిస్తాయో గానీ, అందరూ నన్ను కావాలనుకొనేవాళ్ళు అయ్యారు...."

ఆనంద్‌కు ఏమీ అర్థంకాక "ఎవరో వాళ్ళు?" అని అడిగాడు....

"గోపీ....మేము అంతకుముందు అద్దె ఇంటి యజమాని కొడుకు.... శేఖర్.... ఇతను మా అమ్మతో పాటూ క్రొత్త టీచరు....మంచి మాటల్తో వాళ్ళనెలాగో తప్పించుకోగలిగాను....వాళ్ళ పరువుల్ని తీసెయ్యాలంటే తీసెయ్యొచ్చు....ఆ పని చేయలేకపోయాను.... అది నా కోపం కూడా కావొచ్చు...."

"అయితే నన్ను వాళ్ళతో కలిపేస్తున్నావా?"

"అలా అయితే నువ్వొస్తానంటే నేనెందుకు ఇంట్లో ఉంటాను....? అయినా, ఎందుకో నా కథ నీకే చెప్పాలని అన్పించింది.... ఎందుకో నీ కోర్కెను తీర్చాలని అన్పించింది.... అందుకే నిన్ను తప్పించుకోవాలనుకోలేదు...."

"ఏమిటి అరుణా? నీకు బాధలా? నీకూ విషాదగాథ ఉందా? ఏమిటది? చెప్పు..."

"చెప్తాను....నా వయసు ఎంతో నీకు తెలుసా?" అని అడిగింది అరుణ....

"తెలియదు.... నా కంటె రెండు మూడేళ్ళు చిన్నదాని వుండొచ్చు...."

అరుణ వింతగా నవ్వింది.... "అని నువ్వనుకుంటున్నావ్, కానీ, నేను నీ కంటె నాలుగేళ్ళు పెద్దదాన్ని...."

"ఎలా అనుకుంటున్నావు అలాగని?"

"ఆ మధ్య నీ పుట్టినరోజని చెప్పావ్ ....అప్పుడే నీ డేట్ ఆఫ్ బర్త్ కూడా చెప్పావు....గుర్తుందా?"

"అవును.... అయితే వయసు గురించి అబద్ధం చెప్తావా?"

"చెప్పను.... నీకు తెలియని ఓ నిజాన్ని చెప్తాను."

"ఏమిటది?" కుతూహలంగా అడిగాడు ఆనంద్....

"....నాకు పెళ్ళయింది...."

"ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాడు..

"చాలా ఏళ్ళ క్రితం.... నాకు ఊహ వచ్చిన కొత్తలో...."

"మరి.... మెడలో...."

"మంగళ సూత్రాలు లేవు..."

"ఏం?"

"తీసేసాను కాబట్టి...."

ఒక నిముషం ఆనంద్ ఏమీ మాట్లాడలేదు....తర్వాత ఆనంద్ అన్నాడు "వివరంగా చెప్పు అరుణా!" అని....

"నాకు ఊహ వచ్చిన వెంటనే పెళ్ళి చేసేసారు.... అప్పుడు నాన్నగారు ఉన్నారు ....దగ్గర సంబంధాలు తప్పిపోతాయని నాన్నగారు బలవంతం చేసిన మీదట పెళ్ళి జరిగిపోయింది...కానీ, ఆ ఊహాకు పెళ్ళంటే ఓ వినోదంగా తెలుసు. భర్త, బాధ్యత, సంసారం, జీవితం వీటికి నిర్వచనాలు తెలియవు .... అందుకే నరకాపడిపోయాను...మూడు సంవత్సరాల్లో నాన్నగారు పోయారు...నేను పెద్దదాన్నయ్యాక నన్ను అత్తవారింటికి పంపించారు.... అప్పటికే అమ్మకు ఉద్యోగం వచ్చింది... అత్తారింటికి వెళ్ళాక నేను చాలా కష్టాలు పడ్డాను.... దగ్గరిదాన్నని, లేదదాన్నని వాళ్ళిష్టం వచ్చినట్లు నన్ను చూసేవారు... అవి అప్పటికి చాలా పెద్ద కష్టాల్లా అన్పించేవి.... కానీ, కొన్ని రోజుల తర్వాత అతను కొట్టడం, తిట్టడం మొదలుపెట్టారు .... కారణం తర్వాత తెలిసింది....అతనికి మరొకామెతో సంబంధం ఉంది.... మొదట్లో అతను బాగానే చూసుకొనేవారు కాబట్టి మిగిలినవారి సాధింపుల్ని భరించగలిగేదాన్ని.... ఇక ఆయనకూడా నన్నలాపడితే అలా చూసే

వారు....ఆ జీవితం కొన్నాళ్ళకు అలవాటై పోయింది.... ఆ తర్వాత అతను సంబంధం పెట్టుకున్నావిడ మరొకనితో సంబంధం పెట్టుకోవడంవల్ల చాలా రోజులు చాలా గొడవలు జరిగాయి....ఒకరోజు జరిగిన గొడవలో అతన్ని అవతలివాళ్ళు దారుణంగా కత్తితో పొడిచి చంపేసారు....అప్పుడు నా మెదడు మొద్దుబారిపోయినట్లయింది.... అతను పోవడం నేను వాళ్ళింట్లో అడుగుపెట్టడం వల్లనేనని నానా దుర్భాషలాడి నన్ను మా ఇంటికి పంపించేసారు.... అప్పటినుండీ, నేను అమ్మదగ్గరే, ఇలాగే నిస్సారమైన బ్రతుకును బ్రతుకుతున్నాను...."

అలసిపోయినట్లుగా అగిపోయింది అరుణ....

ఆనంద్‌కు గుండె నీరైపోయింది....

అందంగా నవ్వుతూ, సరదాగా ఉండే అరుణ జీవితంలో ఇన్ని ఘోరమైన మలుపులు ఉన్నాయా? ఇంత విషాదం ఉందా? అని చాలా బాధపడ్డాడు....

"మరి తర్వాత పెళ్ళి చేసుకోలేకపోయావా?"

"ఈ కాలంలో ఆడపిల్లకు మొదటిసారి పెళ్ళికావడమే కష్టంగా ఉంది.... ఇంక భర్తపోయిన ఆడదాన్ని ఎవరు చేసుకుంటారు? అయినా మళ్ళి పెళ్ళి చేసుకోవాలనుకోలేదు...."

తర్వాత చాలాసేపు ఆ ఇద్దరి మధ్యా మాటలు కరువయ్యాయి....

"కాఫీ త్రాగుతావా, ఫ్లాస్కులో ఉంది...."

ఆనంద్ ఏమీ మాట్లాడలేదు...అరుణ లోపలకు వెళ్ళి కాఫీ కప్పుతో బయటకు వచ్చి ఆనంద్‌కు అందించింది...ఆనంద్ కాఫీ త్రాగేసాడు....

"ఆనంద్! నా కథ చెప్పేసాను.... నేనన్న మాటను నిలబెట్టుకుంటాను.... నీ కోర్కెను తీర్చుకో!" అంది అరుణ...

ఆనంద్ నెమ్మదిగా లేచి ఆ గదిలోని టేబిల్‌మీద ఉన్న తన పెళ్ళికార్డును అందుకొని అరుణ దగ్గరకు వచ్చి ఆ కార్డును ముక్కలు ముక్కలు చేసేసాడు....


అరుణ విస్తుపోయింది ఆనంద్ చర్యకు....

"ఏమిటిది ఆనంద్!" కంగారుగా అంది...."

"ఇది నా నిర్ణయం....నీకు ఇష్టమైతే నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను.... నీ అభిప్రాయం చెప్పు!" అన్నాడు ఉద్రేకంగా....

ఒక్క నిముషం క్రిందపడి ఉన్న శుభలేఖ ముక్కలవైపుచూసి, ఆ తర్వాత ఆనంద్‌వైపు చూసి చిన్నగా నవ్వింది అరుణ....

"....ఆనంద్! ఆ శుభలేఖను ముక్కలు చేసినంత మాత్రాన నిర్ణయమైన నీ పెళ్ళి ఆగిపోయినట్లుకాదు....నీ నిర్ణయం తర్వాత జరిగేది ఓ ఆడపిల్ల




జీవితం ముక్కలివ్వడం....నీ నిర్ణయం సబబైనది కాదు.... నా కథ విని జాలి పడో, నా మీద ప్రేమతోనో నిర్ణయం తీసుకున్నావు.... ఉద్రేకంలో నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.... అందుకు నేనెలా అంగీకరిస్తాననుకున్నావు? నీక్కావాల్సింది, నీ కిష్టమైంది నా దగ్గరేమైనా ఉంటే దాన్ని నీ సొంతం చేసుకో.... అనుభవించి ఆనందపడు.... అంతే కానీ, నీ జీవితాన్ని పంచివ్వడానికి ప్రయత్నించకు...." అంది అరుణ.

ఆనంద్ ఏమీ మాట్లాడలేదు.... అతనిలో ఇందాకటి వరకు చెలరేగిన కోర్కెలు చల్లారిపోయాయి.... ఆమె జీవితం విన్న తర్వాత అతని మనసు మెత్తబడిపోయింది .... అతన్ని గురించి అతనే సిగ్గుపడుతున్నాడు....

"ఏం, మాట్లాడవేం ఆనంద్? రా? నీ కోర్కె తీర్చుకో....నీ జీవితాన్ని పంచుకోను అని అంటున్నాను గానీ, నీకు సుఖాన్నివ్వనని అనడం లేదుగా...." అంది....

ఆనంద్ ఆమెవైపే కన్నార్పకుండా చూసాడు.... కళ్ళల్లో సన్నని కన్నీటి పొర ఏర్పడింది...అతని గొంతు పూడుకు పోయినట్లయ్యింది....

ఒక్కసారిగా లేచి...."సారీ....సారీ అరుణా" అని బయటకు దారి తీసాడు... వీధి తలుపు తీసుకొని వెళ్ళిపోయాడు....

• • •

పెళ్ళి పనులు జోరుగా సాగుతున్నాయి....

ఆనంద్‌ను ఈరోజే పెళ్ళికొడుకును చేసారు....దగ్గరి బంధువులు కొంతమంది వచ్చి పనుల హడావుడిలో తిరుగుతున్నారు....

తన గదిలో కూర్చొని కిటికీలోంచి బయటకు చూస్తున్న ఆనంద్ దృష్టి

ఇంటిముందు సైకిలుపై స్టాండువేస్తున్న పోస్ట్‌మాన్ మీద పడింది....

పోస్ట్‌మాన్ ఉత్తరాలు పట్టుకొని రావడం చూసి ఆనంద్ బయటకువచ్చాడు...

ఆనంద్ కేదో రిజిష్టర్డు కవరు వచ్చింది....

కవరుపైన అరుణ అడ్రసు ఉంది...

గబగబా తన గదిలోకి వెళ్ళి తలుపు దగ్గరకు వేసుకొని కవరు చింపి లోపలున్న కాగితాన్ని తీసాడు....

ముత్యాల్లాంటి అక్షరాలు.... గబగబా చదవడం మొదలుపెట్టాడు....

"ఆనంద్! నమస్కారం....

విష్ యూ హేపీ అండ్ ప్రోస్పరస్ మ్యారీడ్ లైఫ్....

ఆనంద్! నీకు కొన్ని విషయాలు చెప్పాలి... నీకు ముఖస్తంగా చెప్పలేకనే ఈ ఉత్తరం వ్రాయవలసి వచ్చింది....

వయసు మనసును మత్తెక్కిస్తుంది... దాన్ని కూడా పొరల్లో కప్పేస్తుంది.... వయసు ప్రభావం ఎంతున్నా, అది ఎన్ని పొరల్లో కప్పేసి ఉన్నా మనిషైతే, ఆ మనిషికి నిజమైన మనసుంటే కొన్ని పరిస్థితుల్లో అది కరిగిపోక మానదు.... ఒక స్నేహితుడిగా, ఒక మంచి మనిషిగా నిన్ను నేను అభిమానించాను...చనువుగా మాట్లాడాను.... ఆ అభిమానాన్ని నువ్వు అపార్థంచేసుకున్నావు .... ఆ చనువును నాకు నీ మీదున్న కోరికగా, నా చూపుల్ని, మాటల్ని, నవ్వుని ఆదోలా ఊహించుకున్నావు .... అందుకే అలా ప్రవర్తించేవాడివి... నాకు బాగా దగ్గరగా వచ్చి నన్ను అదోరకంగా చూస్తూ తాకేవాడివి.... నేను నిన్ను ఏమీ అనలేకపోయాను... నువ్వు మంచివాడవని నాకు తెలుసు.... కానీ, వయసు ఆడుతున్న ఆటలో నీ మనసు ఓడిపోయింది.... అందుకే నీ మనసు పొరల్ని కరిగించి నీలోని మంచితనాన్ని వెలికితీయాలని ప్రయత్నించేను.. ఆ ప్రయత్నంలో నా జీవితం ఏమౌతుందోనని కాసేపు భయపడ్డాను గానీ, నా అంచనా తప్పుకాలేదు. నువ్వు నేననుకున్న మంచివాడివి, మెత్తని మనసుగలవాడివి...అందుకే నేను చెప్పిన నా కథకు చలించిపోయావు....

సారీ ఆనంద్! నేను చెప్పిన కథ కల్పితం.... ఆ పాత్రలన్నీ కల్పితాలే! నేను కల్పించిన కథకు నీ కళ్ళలో మెదిలిన కన్నీటిపొర నా అంచనాను బలపరచిన ఆధారం....నేనిలా చేసింది నా జీవితం కోసం, నీ నిష్కల్మషమైన స్నేహం కోసం.... కాబోయే నీ భార్య పవిత్రత కోసం నీవెన్ని కలలు కంటూ ఉన్నావో, నన్ను చేసుకొనేవాడు కూడా అవే కలలు కంటాడు కదా!

నీ భార్య నీ కలలకు కేంద్రం అయితే .... నేను మరొకని కలలకు కేంద్రాన్ని....అవునా!

ఆలోచించు....

ఉంటాను....

నీ స్నేహితురాలు....

అరుణ....

ఆనంద్ ఆ ఉత్తరం వైపు చూస్తూ ఉండిపోయాడు....

మేఘాలు లేని నిష్కల్మషమైన ఆకాశం ఆ పెళ్ళికొడుకుని అభినందించి ఆశీర్వదించింది.... □